క్లుప్తంగా

పుల్లలచెరువు తహసీల్దార్‌గా బాలకిశోర్


బాలకిశోర్

పుల్లలచెరువు: పుల్లలచెరువు తహసీల్దార్‌గా ఎ.బాలకిశోర్‌ను నియమించారు. ఆయన సోమవారం కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. యర్రగొండపాలెం తహసీల్దార్‌గా పనిచేస్తున్న ఆయనను పుల్లలచెరువుకు ఇన్‌చార్జిగా నియమించారు. కార్యాలయ సిబ్బంది అభినందనలు తెలిపారు.

ఏయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా నాగయ్య


నియామక పత్రాలు అందుకుంటున్న నాగయ్య

యర్రగొండపాలెం: ఫోర్త్ క్లాస్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా యర్రగొండపాలెంకు చెందిన ఆలేటి నాగయ్య సోమవారం ఎంపికయ్యారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా ఎం.వెంకటసుబ్బయ్య నియమితులయ్యారు. వీరికి ఆ యూనియన్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు కె.కలాం, వి.గౌరునాయుడు నియామక పత్రాలను అందించారు. ఎప్పటికప్పుడు ఉద్యోగుల సమస్యలపై స్పందించి పరిష్కరించేదుకు కృషి చేస్తామని, తమపై నమ్మకంతో రాష్ట్ర పదవులు ఇచ్చిన నాయకులకు వారు కృతజ్ఞతలు తెలిపారు.

బెల్టు షాపులపై దాడి

తాళ్లూరు: దర్శి ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ కె.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో తాళ్లూరు మండలం బొద్దికూరపాడులో చేసిన దాడులలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న ఓ వ్యక్తి వద్ద నుంచి 15 మద్యం సీసాలను ఎక్సైజ్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. హెడ్ కానిస్టేబుల్ కె.ఏడుకొండలు, కానిస్టేబుళ్లు కాశీం పీరా, పి.నాగరాజు పాల్గొన్నారు.

రోడ్డు మార్జిన్ పనులు పూర్తి


రోడ్డు మార్జిన్ పనులు పూర్తి చేసిన తర్వాత..


పనులు చేస్తున్న దృశ్యం

సాక్షి ఎఫెక్ట్..

తాళ్లూరు: మండల పరిధిలోని తూర్పు గంగవరం–తాళ్లూరు రోడ్డు మార్గం మరమ్మతులకు గురవడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారంటూ గత గురువారం సాక్షి దినపత్రికలో వార్త ప్రచురితం అయింది. దీంతో స్పందించిన అధికారులు సోమవారం తారు రోడ్డుకి ఇరువైపులా మట్టి పోసి మార్జిన్ వేశారు. ఈ సందర్భంగా వాహనదారులు హర్షం వ్యక్తం చేశారు.

ఘాటు లేక రైతు డీలా!


మిరపకు పిచికారీ చేస్తున్న మహిళ


పురుగు సోకిన మిరప మొక్క

- పంటకు తెగుళ్ల దెబ్బ
- ఎకరాకు లక్షలు దాటుతున్న పెట్టుబడి
- గుంటూరు మార్కెట్‌లో తగ్గుతున్న ధర

దొనకొండ: మండలంలోని పలు గ్రామాల్లో రైతులు సాగు చేసిన మిరప పంటకు తెగుళ్ల సోకి రైతులు పలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రుద్రసముద్రం, భూమనపల్లి, ఇండ్లచెరువు, మంగినపూడి, వెంకటాపురం, వద్దిపాడు, సంగాపురం, పెదన్నపాలెం, ఎస్ఎస్‌పల్లి, పోలేపల్లి గ్రామాల్లో సుమారు 950 ఎకరాలు మిర్చి పంటను సాగు చేసినట్లు అధికారులు చెప్తున్నారు. తుఫాన్ ప్రభావంతో వాతావరణంలో వచ్చిన మార్పులతో మిర్చి పంటకు బొబ్బర, కొమ్మ తెగులు, బూడిద తెగులు సోకి పంట పొలాలు గిడుగు బారాయి. ఏ తెగుళ్లకు ఏ రకం మందులు పిచికారీ చేయాలో తెలియక అందుబాటులో ఉద్యానవన శాఖ అధికారులు లేక పోవటం రైతులు వేలు వేలు ఖర్చు చేసుకుని క్రిమి సంహారక మందులు పిచికారీ చేస్తున్నారు. ఏ తెగులుకు ఏ మందు వాడాలో అనేది కేవలం దుకాణదారులపై ఆధారపడాల్సి వస్తోందని రైతులు వాపోతున్నారు. వేలకు వేలు ఖర్చు పెడుతున్నామని చివరకు మిగిలేది ఏమాత్రం కనపడటం లేదని గ్రామాల్లోని రైతన్నలు నిరాశ పడుతున్నారు. ఆరుగాలం కష్టపడి పండించిన పంటకు గుంటూరు మిర్చి యార్డులో ధర డీలా పడింది. గత 2 ఏళ్లు మంచి దిగుబడి, మంచి ధర పలికిందని ఈ ఏడాది కూడా అదే రకంగా ఉంటుందని రైతన్నలు మిర్చి పంటపై మొగ్గు చూపారు. ఎకరా నారు, క్రిమి సంహారక మందులు, ఎరువులు, పొలాల దుక్కులు, కూలీలు వగైరా మొత్తం ఇప్పటికే లక్ష దాటింది. తీరా మిరప పంట కాపుకు వచ్చే సమయానికి తెగుళ్ల సోకి భారీ మొత్తంలో నష్ట పోవాల్సి వస్తోంది.


కుచ్చు ముడుతతో గిడుగు బారిన మిరప మొక్క

వాతావరణం మార్పుతో తెగుళ్లు



ఈ ఏడాది వాతావరణం మార్పు కారణంగా తెగుళ్ల విపరీతంగా సోకి మిరప మొక్కలు గిడుగుబారాయి. క్రిమి కీటకాలు సోకటంతో పెట్టుబడి ఖర్చు ఎక్కువయింది. సూచన, సలహాలు ఇచ్చే ఉద్యానవన శాఖాధికారులు గ్రామాల్లోకి రాలేదు. 3 ఎకరాలు సాగు చేశా. ఈ ఏడాది లాభాల కన్నా నష్టం వచ్చే అవకాశం ఉంది. ఆశతో సాగు చేసుకున్నాం. కుటుంబం మొత్తం పొలంలో పని చేస్తున్నాం.

– టి.పాపిరెడ్డి, ఇండ్లచెరువు

5 ఎకరాల్లో సాగు చేశా



ఈ ఏడాది గుంటూరు మార్కెట్ యార్డులో నాణ్యమైన ధర వస్తుందని 5 ఎకరాలు సాగు చేశా. రూ.5 లక్షలు ఖర్చు అయింది. గత 2 సంవత్సరాలు దిగుమతి వచ్చింది. నాణ్యమైన ధర లభించింది. ఈ ఏడాది నష్టాలు వచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయి. పెట్టుబడి ఖర్చులు భారం అయ్యాయి.

– చెన్నుబోయిన గురుమూర్తి, రుద్రసముద్రం

కార్యకర్తను పరామర్శించిన బూచేపల్లి


శ్రీనివాసరెడ్డిని పరామర్శిస్తున్న డాక్టర్ శివప్రసాదరెడ్డి

దర్శి: మండలంలోని త్రిపురసుందరీపురం గ్రామానికి చెందిన సంగన శ్రీనివాసరెడ్డి ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందాడు. తిరిగి ఇంటికి వచ్చిన వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ కార్యకర్త సంగన శ్రీనివాసరెడ్డిని దర్శి శాసనసభ్యుడు, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ బూచేపల్లి శివప్రసాదరెడ్డి శ్రీనివాసరెడ్డిని సోమవారం పరామర్శించారు. ప్రమాదం జరిగిన తీరు అడిగి తెలుసుకున్నారు. ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు. అనంతరం త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. శ్రీనివాసరెడ్డికి ధైర్యం చెప్పారు.

గురుకుల పాఠశాలకు కుర్చీల వితరణ


పాఠశాలకు కుర్చీలు అందిస్తున్న సంస్థ ప్రతినిధులు

దర్శి: ప్రపంచ దివ్యాంగుల దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థాక డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల.. జూనియర్ కళాశాలకు 10 కుర్చీలను మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ఛైర్మన్ దేవతి వరప్రసాద్ అందజేశారు. పాఠశాల ప్రిన్సిపాల్ మాధవరావు, స్వచ్ఛంద సంస్థ కన్వీనర్ కపురం శ్రీనివాసరెడ్డి, రాష్ట్ర వికలాంగుల హక్కుల సాధన కమిటీ ప్రతినిధి సందు వెంకటేశ్వరరావు, నియోజకవర్గ అధ్యక్షుడు ఓబయ్య, పాఠశాల సిబ్బంది ప్రసంగించారు. కపురం శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ సమాజంలోని ప్రతి వ్యక్తి తమకు తోచినంత సహాయ సహకారాలను అందజేయాలని , అప్పుడే మానవజన్మ సార్థకమౌతుందన్నారు.

ఆనందాశ్రమంలో పూజలు


మెట్లకు దీపాలు వెలిగించిన అయ్యప్పలు


పూజలో పాల్గొన్న భక్తులు

దొనకొండ: స్థానిక ఆనంద ఆశ్రమంలో మార్గశిర శుద్ధ తొలి పాడ్యమి పూజలు ఆదివారం రాత్రి, సోమవారం ఉదయం భక్తులు ఘనంగా నిర్వహించారు. ఆశ్రమంలో వెలసిన శ్రీ గోవిందమాంబ సమేత వీర బ్రహ్మేంద్ర స్వామి, కాశీ అన్నపూర్ణ విశ్వేశ్వర స్వాముల వారికి పంచామృత అభిషేకాలు, బిల్వార్చనలు జరిపారు. మహా గణపతి సుబ్రమణ్యేశ్వర స్వామికి, అయ్యప్ప స్వామికి పంచామృత అభిషేకాలు, పడి పూజ, కోటి దీపారాధనలు, సహస్ర దీపార్చనలు సమర్పించి సామూహిక హారతులిచ్చారు. దొనకొండ వాస్తవ్యులు మాడిశెట్టి నారాయణ, పార్వతి, పవన్‌కుమార్, బాలకుమారి, వెంకటేశ్వర్లు, దుర్గాభవాని దంపతులు దీపారాధన కార్యక్రమం జరిపించారు. మర్రిపూడి ఎంపీపీ వాకా వెంకటరెడ్డి, రమాదేవి దంపతులు అల్పాహారం ఏర్పాటు చేశారు. గురు స్వాములు చెన్నం శెట్టి వెంకట్రావు, ఎంపీపీ బొరిగొర్ల ఉషా మురళి దంపతులు పూజలో పాల్గొన్నారు.

హిందువుల ఐక్యతకు కృషి

త్రిపురాంతకం: కులాలకు అతీతంగా హిందువులందరినీ ఐక్యంగా ఉంచేందుకు విశ్వహిందూ పరిషత్ కృషి చేస్తుందని వీహెచ్‌పీ ప్రముఖులు పేర్కొన్నారు. త్రిపురాంతకంలో హిందూ సమ్మేళనం వీహెచ్‌పీ ఆధ్వర్యంలో నిర్వహించారు. వీహెచ్‌పీ ప్రముఖ్ టి. మల్లారెడ్డి మాట్లాడుతు విశ్వహిందూ పరిషత్ గత 60 సంవత్సరాలుగా హిందూ చైతన్యానికి పాటుపడుతోందన్నారు. జనవరి 5న హైందవ శంఖారావం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జిల్లా కార్యదర్శి వై. కోటేశ్వరరావు, వీహెచ్‌పీ, ఆర్ఎస్ఎస్, ఎస్ఎస్ఎఫ్, ప్రముఖులు గురుస్వామి, అంజిరెడ్డి, మల్లారెడ్డి, దుర్గారెడ్డి, పూర్ణయ్య, శేఖర్, శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు. అలాగే అన్నసముద్రం శివాలయం వద్ద జరిగిన కార్యక్రమంలో ఎస్. శ్రీనివాసరావు, క్రిష్ణయ్య, రమేష్, సుబ్బారావు, మూర్తి పాల్గొన్నారు.

దర్శి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో స్కిల్ శిక్షణ

దర్శి: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో స్కిల్ హబ్‌సెంటర్‌లో శిక్షణ కార్యక్రమం జరుగుతుందని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఏవీ కవిత తెలిపారు. 10వ తరగతి, ఇంటర్, ఐటీఐ, డిగ్రీ అర్హత కలిగిన వారు ఉపయోగించుకోవాలని కోరారు. ఈ నెల 7వ తేదీ లోపు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని.. పూర్తి వివరాలకు 9949914337 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

అనారోగ్యంతో వైఎస్సార్ సీపీ నేత మృతి


వెంకటేశ్వరరెడ్డి మృతదేహానికి సంతాపం తెలుపుతున్న నాయకులు

యర్రగొండపాలెం: మండలంలోని నరసాయపాలెం గ్రామానికి చెందిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు గాయం వెంకటేశ్వరరెడ్డి సోమవారం మృతి చెందాడు. ఆయన గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడని తెలిపారు. వెంకటేశ్వరరెడ్డి భార్య నరసాయపాలెం పంచాయతీ సర్పంచ్‌గా సేవలు అందించారు. వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు ఒంగోలు మూర్తిరెడ్డి, మండల అధ్యక్షుడు కొప్పర్తి చిన్న ఓబులరెడ్డి, ఎంపీపీ దొంతా కిరణ్‌గౌడ్, జెడ్పీటీసీ చేదూరి విజయభాస్కర్ ఆయన మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

సేంద్రియ ఎరువులపై అవగాహన


వ్యవసాయాధికారులకు అవగాహన కలిగిస్తున్న జిల్లా అధికారులు

దర్శి: దర్శి సబ్‌డివిజన్ పరిధిలోని 8 మండలాల వ్యవసాయ అధికారులకు, విస్తరణాధికారులకు, రైతు సేవాకేంద్రం సిబ్బంది సోమవారం జిల్లా వనరుల కేంద్రం ఆధ్వర్యంలో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కెపాసిటీ ఎన్హాన్స్‌మెంట్.. రబీ పంటల్లో చేపట్టాల్సిన మేలైన యాజమాన్య పద్ధతులపై శిక్షణ కార్యక్రమం ఆత్మా పీడీ యం. సుబ్రహ్మణ్యేశ్వరరావు తెలియజేశారు. భూసార పరీక్ష ఫలితాలను రైతులకు తెలియజేసి నేల ఆరోగ్యం, ఎరువుల యాజమాన్యం గురించి, రసాయనిక ఎరువులు తగ్గించి సేంద్రియ ఎరువుల వాడకం పెంచి నేలలో సేంద్రియ కర్బన శాతాన్ని పెంచేలా రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు. జీవన ఎరువులు, జీవ శిలీంద్ర నాసినులు, పంటదశలు, పురుగులు, తెగుళ్లు, పోషక లోపాల మొబైల్ అప్లికేషన్, ఎన్‌పీఎస్ఎస్ అప్లికేషన్ ప్రాముఖ్యత గురించి జిల్లా వనరుల కేంద్రం సమన్వయకర్త రామ్మోహన్ తెలియజేశారు. కంది, పెసర మరియు మినుము పంటల్లో ఎరువులు, యాజమాన్యం, తెగుళ్ల యాజమాన్యం గురించి ప్రాంతీయ పరిశోధన స్థానం హెడ్ డాక్టర్ పి. సంధ్యారాణి తెలియజేశారు. శనగ పంటలో పురుగులు, తెగుళ్ల యాజమాన్యం గురించి డాక్టర్ సీహెచ్ వరప్రసాద్ తెలిపారు. వరిపంటలో పురుగులు, తెగుళ్ల యాజమాన్యం గురించి ఎస్ఎంఎస్ డాక్టర్ టి. వెంకటేశ్వరరెడ్డి వివరించారు. క్షేత్ర స్థాయిలో పంట నమోదు చేసే సమయంలో పాటించాల్సిన జాగ్రత్తల గురించి దర్శి సబ్‌డివిజన్ సహాయ వ్యవసాయ సంచాలకులు కె. బాలాజీ నాయక్, టెక్నికల్ వ్యవసాయాధికారి బి. సంగమేశ్వరరెడ్డి తెలిపారు.

కార్యక్రమంలో జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయాధికారులు ఏ. శైలజారాణి, వీవీ శేషమ్మ, దర్శి సబ్ డివిజన్‌లోని అన్ని మండలాల వ్యవసాయాధికారులు, వ్యవసాయ విస్తరణాధికారులు పాల్గొన్నారు.

ఉల్లాసంగా యూత్ సెమీ క్రిస్మస్

త్రిపురాంతకం: యూత్ సెమీ క్రిస్మస్ వేడుకలను తెలుగు బాప్టిస్ట్ చర్చి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. త్రిపురాంతకం మండలం రాజుపాలెం బాప్టిస్ట్ చర్చిలో నిర్వహించిన కార్యక్రమంలో ఎస్ఐ శివబసవరాజు, డాక్టర్ శ్రీనివాసరావు, కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. పాస్టర్ జీవన్ బులర్డ్ వాక్యోపదేశం చేశారు.


త్రిపురాంతకం: యూత్ సెమీ క్రిస్మస్ వేడుకల్లో కేక్ కట్ చేస్తున్న ఎస్ఐ తదితరులు

భగవద్గీత ప్రచారం

కురిచేడు: మండలంలోని ఆవులమంద, పడమరనాయుడుపాలెం, కల్లూరులో సోమవారం మార్గశిర మాసం సందర్భంగా త్రైత సిద్ధాంత భగవద్గీతపై ప్రచారం నిర్వహించారు. త్రైత సిద్ధాంతం–ప్రబోధ సేవాసమితి ఇందూ జ్ఞానవేదిక దొనకొండ కమిటీ అధ్యక్షుడు టి. ఏడుకొండలు, సభ్యులు ఎ. చెన్నకేశవులు, ఎ. బాలరంగయ్య పాల్గొన్నారు.

వృద్ధురాలు ఆత్మహత్యాయత్నం

కురిచేడు: గ్రామానికి చెందిన సాంబమ్మ అనే వృద్ధురాలు సోమవారం నాగార్జునసాగర్ కాలువలో దూకి ఆత్మహత్యాయత్నం చేసింది. ఆ సమయంలో అక్కడ చూసినవారు ఆమెను కాపాడి పోలీసులకు సమాచారం అందించారు. సాంబమ్మ భర్త వెంకటేశ్వర్లు 5 సంవత్సరాల క్రితం మృతి చెందాడు. సాంబమ్మ అప్పటి నుంచి ఒంటరిగా జీవనం సాగిస్తోంది. అప్పుడప్పుడు తన చిన్నకుమారుడు వచ్చి వెళుతుంటాడు. పోలీసులు ఆమెకు కౌన్సిలింగ్ ఇచ్చి ఆమె కూతుర్లకు అప్పగించారు.

ఎయిడ్స్ బాధితులకు సరుకుల అందజేత


సరుకులు అందజేస్తున్న లయన్స్‌క్లబ్ సభ్యులు

దర్శి: ఎయిడ్స్ వారోత్సవాల్లో భాగంగా స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రంలో సోమవారం 15 మంది ఎయిడ్స్ బాధితులకు లయన్స్‌క్లబ్ ఆఫ్ దర్శి స్నేహ ఆధ్వర్యంలో నిత్యావసరాలు పంపిణీ చేశారు. ఆరోగ్యకేంద్రం సూపరింటెండెంట్ డాక్టర్ టి.సుమన్, కంటి వైద్య నిపుణులు డాక్టర్ గీతపద్మ, జిల్లా ఎన్విరాన్‌మెంట్ ఛైర్‌పర్సన్ కల్లూరి విద్యాసాగర్ రెడ్డి, క్లబ్ గైడింగ్ లయన్ బూదాటి ఆంజనేయులు, లయన్స్‌క్లబ్ ఆఫ్ దర్శిస్నేహ అధ్యక్షుడు తమ్మవరపు ఫణిబాబు, సెక్రటరీ పానుగంటి సత్యనారాయణ గుప్త, ట్రెజరర్ గుడిపాటి అశోక్, క్లబ్ సభ్యులు చింతా తిరుపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వీరాంజనేయ స్వామికి ప్రత్యేక పూజలు


ప్రత్యేక పూజల్లో భక్తులు

త్రిపురాంతకం: పోలు స్వర్గం సందర్భంగా వీరాంజనేయస్వామి ఆలయం వద్ద ప్రత్యేక పూజలు, దీపోత్సవం నిర్వహించారు. భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన నీటిలో దీపాలను వెలిగించారు.